# స్వప్న సందేశం

రచన:
కుమార్

తుపాను సంక్షోభానంతరం
వొకనాటి విషాదరాత్రి.

మూర్తీభవించిన భారతీదేవిలా ఓ స్త్రీ మూర్తి ప్రసన్నమై కంఠంవిప్పింది, దేవేంద్రవైభవం (తాత్కాలికం)తో కులుకుతూన్న నేను చెవులనిక్కించాను. ఆమె ఉద్బోధిస్తూంది.

"ఇదియెంతటి అపయశస్సు? ఇవి యేనాటి యెవరిదుస్సహ కృత్రిమ నిర్ణయాలు? నీ తోటి సోదర మానవునకు కూడులేక పొట్టెండి శల్యమై పోతూంటే నీవు పంచ భక్ష్య పరమాన్నంతో కడుపునింపుకుని కండరాలు పెంచుకుంటావా? నీతోటి సోదరమానిసికి కట్టగుడ్డ లేక దిశమొలతో కృంగిపోతూంటే నీవు చీని చీనాంబరములతో కులుకుతూ విజృంభిస్తావా? నీతోటిసోదరునకు నిల్వనీడలేక చలి, యెండవానలకుగురై కృశించిపోతూంటే నీవు మహోన్నత భవనాల్లో బంగారు తూగుటూయలలో వుల్లాసంతో వూగుతావా? నీతోటి సోదరికి మాన ప్రాణరక్షణ లేకపోయి, ఆమె దిక్కుమాలిందైతే నీవు సాయుధ సిబ్బందితో రమ్యమైన గూఢస్థలాల్లో దాగొని కాపురం జేస్తావా? ఇవి పూర్వపరిస్థితులే కావు; ఇవి ఆనాటి బానిసప్రవృత్తులేకావు; ఈనాటి స్వతంత్రదేశంలోకూడా యీ సాంఘిక ఉచ్ఛిష్టాలు, పక్షపాతాలు కొనసాగుతూంటే హృదయం...జాతీయతగల మానవుడు మధనపడకుండా వుండగలడా? అనలుయెలా సహించుకో గలడు?"

"మానవుడు యెంత శ్రీమంతుడైనా యెంతటి స్వతంత్రుడైనా, లేక దుర్భర దరిద్రుడైనా, బానిసయైనా తోటి సోదరమానవుని సహాయం సహకారం లేనిదే బ్రతుకేదుస్తరం; నిరంకుశంగా జీవించలేడనే గుర్తించుకో!"

"నీవు దాగొనే ప్రతిరమ్యహర్మ్యం—ప్రతికట్టడంకట్టి, నివాసానికై—విశ్రాంతికై నీకర్పించినది నీతోటి మానవసోదరులేనని నీవు గమనించుకో! నీకు కూడుగుడ్డలు అర్పించి నీ మనుగడకు తోడ్పడేవారు నీ మానవసోదరులేనని నీవు గుర్తించుకో !! నీ రక్షణకొరకై సాయుధ సిబ్బందిగామారి అహోరాత్రాలు పహరా కాస్తున్నవాడు నీతోటి మానవ సోదరులేనని అవగాహన జేసుకో !!!...అట్టి ప్రజ చేయి త్రిప్పకపోయి, మేడిపట్టకపోయి—మగ్గాన్ని ముట్టక, ఆయుధాన్నిధరింపక మిన్నకుంటే నీగతియేమి? నీరాజ్యమే పూజ్యంకదూ!

---

## ప్రకటన

చిత్రగుప్త చందాదారులు ఆఫీసుకు ఉత్తరాలు వ్రాయునపుడు తమ చందా నంబరు తప్పక తెలుపవలయును. అలాగుచేసిన ప్రత్యుత్తరము త్వరలో బడయగలరు. తమ చందా నంబరు తెలుపనపుడు ఆఫీసు ఉద్యోగులకు వృధా శ్రమయు, కాలయాపన జరుగుచుండును.

మేనేజరు,
చిత్రగుప్త ఆఫీసు.

---

తమఛాయను బ్రతుకనెంచిన చిన్నమొక్కల యొక్క మనుగడకు అవసక్తమైన అవకాశాలను ఆధారాలను, తామేగ్రసించి ఆ చిన్నచెట్లను చంపే పెనువృక్షాల్లా నీతోటి సోదర మానవులపైనా నీకీ వైరుధ్యం? నీకీ కృతఘ్నత? వారేం అపచారం జేశారు? వారేం అపకారం సలిపారు.? కాలగతి రూపొందిన స్వల్పాధిక్యతలు కారణమా? ఐతే...యీనాడు దుర్బలులై నిస్సహాయులై దుర్గతితో ఆబాటను కదలిపోతూంటే, వారు నీ నయనాలకు కన్పిస్తున్నారా? రోదసీకుహరాలు ప్రతిధ్వనించేవారి ఆక్రందనాలు నీ చెవులకు వినిపిస్తున్నాయా? ప్రతిజీవాణువు యొక్క సృష్టి, స్థితి—లయస్థానమైన ఆ విశాల ప్రకృతికి గోచరిస్తూందా?"

"జీవితానికి విశేషమైన వెండిబంగారాలు తగిలినంతమాత్రాన, ధనధాన్యాలు చేకూరిన మరుక్షణాన్నే మానవహృదయం అహంతో స్వార్థంతో ఘనీభవింపబడి పోతూందే! ఈ యథార్థతను నమ్మేవా? అవయవములపైనుండి జీరాడే స్వర్ణాలంకారశోభ మురిపెంలో, భోగలాలసత్వంలో పడి నిరుపేదలైనవారిని కానడే!! ఈసత్యాన్ని అంగీకరిస్తావా? కర్ణములకు స్వర్ణభూషణాలు తగిలింపబడగానే, పీడితులైనవారి ఆర్తనాలు వినుపింపవే!!! ఈ నిజాన్ని వొప్పుకుంటావా? స్వరాజ్యపథంలో పేదవానిని గండుపేదగామార్చి భాగ్యవంతుడు తాను అమిత భాగ్యవంతుడిగా తయారవుతున్నాడే!—సమాన ప్రతిపత్తి లేదు. రాజకీయ వాతావరణంలో వోమతవర్గమును రూపులేకుండా అంతరింపజేసి మరోమతవర్గం తాను కలుషితంగా విజృభిస్తూందే!! నిరంకుశ వర్తనంతో, మతసామరస్యం పూజ్యమై పోయింది. యావత్ప్రపంచములో జాతీయపరిస్థితులు మహోపద్రవమై విషవాయువుల్ని విసరతూంటే, అంతర్జాతీయ పరిస్థితులు మహాభయానకంగా నిర్ద్యాతనంగా కారుపొగలు క్రక్కుతున్నాయ్!!!. నియంతృత్వంలో—భోగ కాంక్ష పెచ్చుపెరిగి—దురాక్రమణలు ప్రబలినై. ఈ పరిస్థితులను కనివినీ కూడా నీ హృదయంలో పరివర్తన రాదేం? నీ పురుషార్థాన్ని—నీ కనీసపు కర్తవ్యాన్ని విస్మరించి యెలా మిన్నకుండ గల్గేవ్?."

"ఈ కఠిన పరిస్థితుల నెదుర్కోడానికి మేడల్లోనెక్కి 'కూని' రాగాలుతీస్తే ప్రయోజనం లేదు; నీతోటి మానవుని పౌరసత్వ హక్కులకై యెలుగెత్తి విజ్ఞాపన జేయ్ ! ఈ దుస్సహపరిస్థితులను పరిష్కరించడానికి, కేంద్రంలో పదవులకై ప్రాకులాడితే లాభం లేదు; పేదలతో సంఘీభవించి పదవీన్యామో

హులను - నిరంకుశవర్తనులను అధఃపాతాళానికి త్రొక్కి - సాంఘికసమతను బలపర్చు!! ఈ కల్లోలపరిస్థితుల్లో శేనకువేలు వెచ్చించి వినోదాలతో ఆనందించడమే గాకుండా, అందు శతాంశద్రవ్యాన్ని అనాథులైనవారికి ప్రసాదించి వారికడ చన్నప్రాణాలు నిల్పితే యెంతైనా ఉదారత! ఆర్తులైనవారికి ఒక అడుగు గుడ్డపేలికను ప్రసాదించి వారి మానాలను కప్పిబుచ్చితే యెంతైనా ఉదాత్తత!!

స్వతంత్రమై మహోజ్వలమైనదిగా కొనియాడబడే నీదేశం, పరదేశాలకు శాంతి శుభ సందేశాలను పంపేముందు శాంతి - భద్రతలు కల్గి, సర్వస్వతంత్రమై యుండాలి! స్వతంత్రమై - వీరోచితమైనదిగా కొనియాడబడే నీజాతి, అన్యజాతుల్లో విజ్ఞానపరంపరలు వీర్య శక్తులు వికాసింపజేసేముందు - సాహితీ సంస్కృతులతో వెలుగొంది సర్వస్వతంత్రమై యుండాలి!! స్వతంత్రుడవై విద్యాసంపన్నుడవని కొనియాడబడే నీవు, పరులను సంస్కరించేముందు, భూతదయాపరోపకార తత్త్వాలతో పుంజీభవింబపడి సర్వస్వతంత్రుడవై యుండాలి !!!

"భాగ్యవంతుడివైతే స్వార్థరహితుడవై తోటిపౌరులను శక్తికొలదీ పోషించి నీవు పోషింపబడాలి! వీరుడవైతే, శూరుడవై దేశోద్ధతికి, జాతిపురోభివృద్ధికి, వ్యక్తి జీవితౌన్నత్యానికి నిరోధకములైన సాంఘికప్రతిబంధకాలను, దురాచారాలను పగులదన్ని పౌరులను రక్షించి నీవు రక్షింపబడాలి !! స్వతంత్రపౌరుడుగా, తోడిపౌరులకు పౌరసత్వాన్ని పెంపొందించి, స్థిరత్వం యేర్పరస్తూ ప్రభుత్వానికి సహకారమొనర్చి - నీవు సహకరింపబడాలి!! త్యాగమూర్తిగా ప్రజాశ్రేణినంతా సర్వసమైక్యతనుజేసి, సమత్వాన్ని చాటి ప్రజలతోపాటు ముందంజ వేస్తూ నియంతగా నిరాడంబరజీవిగా చాటబడాలి !!!

"ఈ బాధ్యతలను గుర్తించి, కర్తవ్య భారం నిర్వహిస్తే, ప్రజాశక్తి సమకూడి, ఆ సాంఘికబలంతో, సమత్వంతో, సాధింపలేని కార్యం లేదనే నగ్నసత్యం నీ కనుభవైక్యమవగలదు; అంతేగాని యీనాడు మానవుడవైయుండి, నీకర్తవ్యభారం నిర్వహింపవలసిన క్షణంలో, నీ పురుషార్థాన్ని, బాధ్యతను విస్మరించి, సోమరివై అమూల్య కాలాన్ని, మూర్ఖ మూకీ భావాలతో వ్యర్థపుచ్చితే— లజ్జాకరం కదూ ! వినాశకరం కాదా? లే ! ఇదే నాసందేశం; దీన్ని కనీసం నీకలంద్వారానైనా ప్రతిహృదయంలోకి గ్రుచ్చగలవనే నా దృఢవిశ్వాసం లే! నాయనా! లే!!" ఆమె ముగించింది.

నా వక్షాన్ని యెవరో చరిచినట్లవగా త్రుళ్లిపడి లేచా! కలలో దేవేంద్రవైభవం పొందిన నాకు ఆమె అదృశ్యమైనా ఆమె సందేశంమాత్రం శాశ్వతంగా బుర్రలో కెక్కింది.........నాకు పూర్తిగా తెలివి వచ్చింది. ఐతే నాస్థితిని గుర్తించుకునే సర్కినాకన్న దౌర్భాగ్యులున్నారా యని యెలుగెత్తి యేడ్చాను.........నేను, యే కూలిపోయిన పూరిగుడిశెలో ఆరాత్రంతా నిద్రించానో, ఆ గుడిశెలోనేవున్నా, యే చింకిగుడ్డతో నా దేహాన్ని కప్పుకున్నానో ఆచింకి గుడ్డ అదృశ్యమైపోయింది.

# మరుపురాని మగువ

రచన: బెహరా జగన్నాథం

●

మరువలేకున్నానురా । నా లక్ష్మి
కరుణ కెదురున్నానురా॥

వెన్నెల్లో ఆనాడు
సన్నచీరాగట్టి
కన్నెవలపులతోడ
నన్ను రమ్మన్నాది

చిన్నముద్దులగుమ్మరా । నా లక్ష్మి
వన్నెబంగరుబొమ్మరా॥

మగువకోరుచునుండ
బిగువు నీకేలంది
జగములోనీసాటి
మగడు నా కేడంది

వగలవయ్యారిభామరా । నా లక్ష్మి
మిగులజూపెను ప్రేమరా॥

పాడులోకముతోన
పని నాకు లేదంది
ఆడుచును పాడుచును
హాయి గుందామంది

చూడచక్కనిచుక్కరా । నా లక్ష్మి
మేడపైనేపక్కరా॥

కలలోన ఆరూపు
తళతళ మెరసింది
కలువరేకులకల్లు
మిలమిలా మెరసింది

వలపులూలికెడి కలికిరా । నా లక్ష్మి
చిలుకపలుకులు పలికెరా॥

తొయ్యలిఒకరేయి
చెయ్యి చెయ్యి కలపి
పయ్యెద విదలించి
సయ్యాట లాడింది

వెయ్యిమాటలు ఏలరా । నా లక్ష్మి
వయ్యారములకుప్పరా॥

